క్లుప్తంగా

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

కమలాపురం : మార్చి నెల 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్. లావణ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, క్రిమినల్, బ్యాంకు కేసులు ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. రాజీ ధోరణిలో ఉన్న ఇరు వర్గాల కక్షిదారులు ఈ విషయాన్ని గమనించి మార్చి 8వ తేదీన జరిగే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని తమ కేసులను పరిష్కరించుకోవాలని మెజిస్ట్రేట్ తెలిపారు.

వేడుకగా సత్యనారాయణ స్వామి వ్రతం



సత్యనారాయణస్వామి వ్రతంలో అర్చకులు, మహిళలు

వేంపల్లె : స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం వేడుకగా నిర్వహించినట్లు ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి తెలిపారు. మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం అర్చకుడు అచ్యుత్ నారాయణ నేతృత్వంలో ఈ వ్రతాన్ని చేపట్టారు. పంచామృతాభిషేకం, కుంకుమార్చన, తదితర పూజాది కార్యక్రమాలు చేశారు. ఆలయ ఈఓ మాట్లాడుతూ మాఘమంటే యజ్ఞమని, దైవ కార్యాలు చేసేందుకు మాఘమాసాన్ని అత్యున్నతమైందిగా పెద్దలు ప్రస్తుతించారన్నారు. ఈ మాసంలో పరమ విశిష్టమైన రోజు మాఘ పౌర్ణమి అన్నారు. ఈ రోజు చేసే నది, సముద్ర స్నానాలు, పూజలు అపారమైన ఫలాలను ఇస్తాయని శాస్త్రలు చెబుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పంటలను పరిశీలిస్తున్న ఏఓ సరస్వతి

కమలాపురం : రైతులు తాము సాగు చేసిన పంట పొలాల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ సరస్వతి తెలిపారు. బుధవారం దాదిరెడ్డి పల్లె, ఎల్లారెడ్డిపల్లెల్లో జరిగిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో ఆమె పర్యటించి పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రైతులు సాగు చేసిన పంటల్లో ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఇ–పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు తప్పని సరిగా ఇ–కేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం రైతులకు ఆధార్ తరహాలో 14 అంకెల ప్రత్యేక గుర్తింపు కార్డు జారీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో వీఏఏ బాబు, రైతులు పాల్గొన్నారు.

ఎద్దుల బండిని ఢీ కొన్న లారీ

కమలాపురం : క్రాస్ రోడ్డు సమీపంలో ఎద్దుల బండిని లారీ ఢీ కొన్న ఘనటలో ఎద్దుకు తీవ్ర గాయమైంది. బుధవారం తెల్లవారు జామున కె.కొత్తపల్లెకు చెందిన రైతు కొరటాల శ్రీనివాసులరెడ్డి ఎద్దుల బండితో ఆర్‌సీఎం చర్చీ వద్దకు రాగానే ఎర్రగుంట్ల వైపు వస్తున్న లారీ వెనుక వైపు ఢీ కొన్నది. ఈ ఘటనలో ఒక ఎద్దుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురించి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు బాధిత రైతు తెలిపాడు.

డిగ్రీ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత



పి.లక్ష్మీదేవి



రాజకులాయమ్మ

జమ్మలమడుగు : యోగివేమన యూనివర్శిటీ పరిధిలో జరిగిన సెమిష్టర్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ డిగ్రీకాలేజి విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించారని కాలేజి ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి సెమిష్టర్‌లో పి.లక్ష్మీదేవి 10 జీపీఏ, బి.రాజకులాయమ్మ 9.50 పాయింట్లు సాధించి యూనివర్శిటీ టాపర్‌లుగా నిలిచారన్నారు.

రేషన్ పంపిణీలో కోత

వల్లూరు : మండలంలోని లేబాక రేషన్ షాపు పరిధిలో కార్డుదారులకు ఇస్తున్న రేషన్ బియ్యంలో కోత విధించారు. స్థానిక వీఆర్‌ఏ పేరుతో ఈ షాపునకు అధికారులు రేషన్ సరఫరా చేస్తున్నారు. పేరు వీఆర్‌ఏదైనప్పటికీ అదే గ్రామ పంచాయతీకి చెందిన ఓ టీడీపీ నేత రేషన్ షాపును నడుపుతున్నాడు. ఈ క్రమంలో సదరు నేత ఈ నెలలో ఇవ్వాల్సిన రేషన్ పంపిణీలో చేతి వాటం చూపి కార్డుదారులకు ఇవ్వాల్సిన బియ్యంలో కోత విధించాడు. 25 కిలోలు ఇవ్వాల్సిన లబ్ధిదారులకు కేవలం 10 కిలోలు ఇచ్చి సరిపుచ్చుతున్నాడు. ఇదేమని అడిగిన ప్రజలకు నేను ఇచ్చేది ఇవే. మీరు ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని జవాబిస్తున్నాడని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. పేదవారైన తమ పొట్ట కొట్టడమేంటని వారు ప్రశ్నిస్తున్నారు.

దీనిపై తహసీల్దార్ శ్రీవాణిని వివరణ కోరగా వెంటనే విచారణ చేపట్టి పూర్తిస్థాయిలో రేషన్ పంపిణీకి చర్యలు తీసుకుని ప్రజలకు న్యాయం చేస్తామని తెలిపారు.

విరగ్గాసిన దానిమ్మ

- జమ్మలమడుగులో ప్రయోగాత్మకంగా దానిమ్మ సాగు
- దానిమ్మ సాగుపై రైతుల చూపు
- మంచి అదాయాన్ని ఇచ్చిన పంట



చెట్టుకు విరగ్గాసిన దానిమ్మ పండ్లు



గొరిగెనూరులో సాగు చేసిన దానిమ్మ పంట

జమ్మలమడుగు రూరల్ : గతంలో ఎన్నడూలేని విధంగా జమ్మలమడుగు ప్రాంతంలో ఓ రైతు దానిమ్మ పంటను ప్రయోగాత్మకంగా సాగుచేశాడు. పెట్టుబడులు పెట్టిన తరువాత దిగుబడి ఎంత మాత్రం వస్తుందోనని ఎదురుచూసిన రైతుకు దానిమ్మ పండ్లు సంతృప్తికర పంటను ఇచ్చాయి. పొలంలో ఎటు చూసినా మొక్కలకు దానిమ్మ పండ్లు విరగ్గాశాయి. మార్కెట్లో దిగుబడికి తగ్గరేటు ఉండటంతో దానిమ్మ పంట ఆ రైతు ఇంట సిరులు కురిపించిందని చెప్పవచ్చు.

10 ఎకరాలు.. రూ.50 లక్షల ఆదాయం

జమ్మలమడుగు మండలం గొరిగెనూరు గ్రామానికి చెందిన మోతుబరి రైతు గోనా జయసింహారెడ్డి తన కున్న భూమిలో 10 ఎకరాలలో దానిమ్మ పంటను సాగుచేశాడు. దానిమ్మ మొక్కను మహారాష్ట్రలోని పూణెలోని జైను కంపెనీ నుంచి కోనుగోలు చేసి మొక్కలను తెచ్చి మొదటిసారి పంట సాగు చేశాడు. ఏ సమయానికి ఏ ఎరువులు వేయాలో వేస్తూ పంటకు నీరు సమృద్ధిగా పెడుతూ తానే దగ్గరుండి చూసుకుంటూ వచ్చాడు. సాగు మొదలెట్టిన ఏడాది నుంచి పూత వచ్చింది. జమ్మలమడుగు వాతావరణానికి పూత నిలబడుతుందో లేదో అనుకున్న తరుణంలో పూత నిలబడి మంచి సైజులో పండ్లు వచ్చాయి. అంతే కాకుండా మంచి దిగుబడి వచ్చింది. టన్ను దానిమ్మ బయటి మార్కెట్లో లక్ష రూపాయలు ఉంది. అంతే కాకుండ ఇటీవల ఫెంగల్ తుఫాను కారణంగా ఇతర ప్రాంతాలలో పంట సాగు దెబ్బతినడంతో మంచి డిమాండ్ ఉందని రైతు తెలిపాడు. దానిమ్మ పంటను చూసిన వ్యాపారస్థులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి కోనుగోలు చేస్తున్నారని రైతు ఆనందం వ్యక్తం చేశాడు. 10 ఎకరాలకు గాను రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఆదాయం వచ్చిందన్నారు.

జమ్మలమడుగు ప్రాంతంలో 52 ఎకరాలలో సాగు

మండలంలో జయసింహారెడ్డి 10 ఏకరాలతో పంట సాగు చేశాడు. అలాగే మైలవరం మండలంలో 6 ఏకరాలు, ముద్దనూరు మండలంలో 20 ఏకరాలు, కొండాపురం మండలంలో 20 ఎకరాలు దానిమ్మ పంటను రైతులు సాగు చేశారు. జయసింహారెడ్డి పంట కోతకు వచ్చింది. కానీ మిగిలిన రైతులు ఆదాయం కళ్ల చూడాలంటే ఇంకో 6 నెలలు పడుతుంది. వీరు ఏడాది క్రితమే సాగు మొదలెట్టడంతో పంట ఇంకా 6 నెలలు పడుతుంది. వీరు ఏడాది క్రితమే సాగు మొదలుపెట్టినా పంట ఇంకా పింద దశలోనే ఉంది. ఇవి కూడా మంచి దిగుబడి ఇస్తాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కాగా నీటి వసతి బాగా ఉన్న చోట దానిమ్మ సాగు మంచి ఆదాయాన్ని ఇస్తుందని జమ్మలమడుగు డివిజనల్ ఉధ్యానాధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. గొరిగెనూరు రైతు జయసింహారెడ్డి దిగుబడి చూసిన తరువాత చాలామంది రైతులు దానిమ్మ సాగుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది.



దానిమ్మ పండ్లను కొనుగోలు చేస్తున్న వ్యాపారస్థులు

తొలిసారి కష్టానికి తగ్గ ఫలితం చూశాం



నాకు 30 ఏకరాల పొలం ఉంది. రాజకీయాల్లో కొనసాగుతున్నప్పటికీ వ్యవసాయమే మాకు ప్రధాన వృత్తి. పెన్నానది ఒడ్డునే మా పొలాలు ఉండటంతో నీటికి సమస్య లేదు. గతంలో వరి పంట పండించే వాళ్లం. ఒక వేళ దిగుబడి వచ్చినా గిట్టుబాటు ధర ఉండేది కాదు. కానీ దానిమ్మ సాగులో మాత్రం కష్టానికి తగ్గ ప్రతిఫలాన్ని మొదటిసారి చూస్తున్నా.

– గోనా జయసింహారెడ్డి, రైతు, గొరిగెనూరు

దానిమ్మ సాగుకు రైతులు మందుకు రావాలి

జమ్మలమడుగు ప్రాంతంలో దానిమ్మ సాగు అతి తక్కువ విస్తీర్ణంలో మాత్రమే సాగు అవుతుంది. మరింత మంది రైతులు ముందుకు వచ్చి దానిమ్మ పంటను సాగు చేస్తే మంచింది. ఎందుకంటే ప్రస్తుతం మార్కెట్లో దానిమ్మ పంటకు మంచి గిట్టుబాటు ధర ఉంది. రాను రాను పండ్లకు ధర తక్కువ ఉండదు. కాబట్టి రైతులు దానిమ్మ సాగుపై దృష్టి సారించాలి.

– జయ భరత్‌రెడ్డి, ఉద్యానశాఖాధికారి, జమ్మలమడుగు

వ్యవసాయ శాఖ నమోదు చేసే గుర్తింపు సంఖ్య అవసరం

వేంపల్లె : ప్రతి రైతుకు వ్యవసాయ శాఖ నమోదు చేసే 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య చాలా అవసరమని మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు, కార్యక్రమాలు, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, ఎరువుల రాయితీలు, పెట్టుబడి రాయితీలు, పంటల బీమా, సున్నా వడ్డీ, అవసరమైన పంట రుణాలు పొందేందుకు, పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు ఈ గుర్తింపు సంఖ్య ఎంతో అవసరమన్నారు. ప్రతి రైతు సోదరులు మీ దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలన్నారు. గుర్తింపు సంఖ్యకు కొరకు రైతు 1బి నకలు, ఆధార్ కార్డ్, ఆధార్ కార్డుకి అనుసంధానమైన మొబైల్ ఫోన్ కచ్చితంగా తీసుకెళ్లాలన్నారు.

మంచి ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ ఈవో మీనాక్షి

ముద్దనూరు : ఈ ఏడాది జరిగే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని డిప్యూటీ విద్యాశాఖాధికారి మీనాక్షి తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. క్రమశిక్షణతో గతంలో కంటే మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం ఆమె ఉపాధ్యాయుల పాఠ్య ప్రణాళికలను, విద్యార్థినుల నోటు పుస్తకాలను పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సులభ, పారదర్శకంగా రైతుల సేవలు



మాట్లాడుతున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : రైతులకు మరింత పారదర్శకంగా, సులభ తరంగా సేవలు అందించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యలు కేటాయిస్తున్నట్లు ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక తన కార్యాలయంలో నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత భూమి గల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయిస్తున్నారని, తద్వారా వ్యవసాయ సేవలు మరింత పారదర్శకం, సులభతరం కానున్నాయని ఆయన వివరించారు. ఆధార్ తరహాలోనే ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటుందన్నారు. రైతు గుర్తింపు సంఖ్య అనేది రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ గుర్తింపు సంఖ్య ఉంటేనే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే, సబ్సిడీలు, పంటల బీమా తదితర సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. భూ ఆధారిత పథకాలైన పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, వడ్డీ రాయితీ, సబ్సిడీ పై వ్యవసాయ పరికరాలు, సూక్ష్మ పోషకాలు, సూక్ష్మ సేద్యం, పంట రుణాలు, పెట్టుబడి సాయం తదితరవి అందుతాయన్నారు. ప్రతి రైతు సంబంధిత ఆర్‌ఎస్‌కేలకు వెళ్లి పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్, లేదా 1బీ, అడంగల్, ఆధార్ కార్డు జిరాక్స్, ఆధార్ కార్డుతో లింక్ అయిన సెల్ ఫోన్ తీసుకెళ్లి నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఈఓ దస్తగిరి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డి సాయినాథునికి పాలాభిషేకం

పులివెందుల టౌన్ : పట్టణంలోని పార్నపల్లె రోడ్డులో వెలసిన శ్రీషిర్డిసాయిబాబా ఆలయంలో బుధవారం మాఘశుద్ధ పౌర్ణమిని పురష్కరించుకుని బాబావారికి 108 బిందెల పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళి భక్తులతో ప్రతి ఒక్కరి చేతులమీదుగా సాయిబాబా విగ్రహానికి పాలాభిషేకం చేయించారు. ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు భక్తులు పాలు తీసుకొని వచ్చి బాబాను అభిషేకించారు. అనంతరం షిర్డిసాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించి, మహా మంగళ హారతులు పట్టారు.

విద్యార్థి విజయకేతనం



హర్షద్‌ఆలీ

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీసాయి చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థి జేఈఈ మెయిన్స్‌లో విజయకేతనం ఎగురవేసి సత్తా చాటారని కళాశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫస్ట్ సెషన్ ఫలితాలలో తమ కళాశాలకు చెందిన హర్షద్ ఆలీ 90.38 శాతంతో పులివెందుల టౌన్ టాపర్‌గా నిలిచారన్నారు. తమ కళాశాల విద్యార్థి ప్రతిభపట్ల కళాశాల డైరెక్టర్ నీరజ, అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట వేడుకలు



నూతనంగా నిర్మించిన ఆలయం

తొండూరు : మండలంలోని అగడూరు గ్రామంలోని శ్రీసీతారామ, లక్ష్మణ, హనుమద్ విగ్రహ ప్రతిష్ట వేడుకలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయని గ్రామస్తులు తెలిపారు. 13వ తేదీ గురువారం ఆలయ ప్రవేశం, గోపూజ, గణపతి పూజ తదితర పూజాది కార్యక్రమాలతోపాటు జలాది వాసం, నైవేద్యం, మంగల హారతి తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 14వ తేదీ శుక్రవారం ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, మధ్యాహ్నం నుంచి శ్రీసీతారాముల గ్రామోత్సవం ఉంటుందన్నారు. 15వ తేదీన శనివారం వివిధ పూజలు, హోమాలతోపాటు స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠతోపాటు సాయంత్రం శ్రీసీతారాముల కల్యాణం జరుగుతుందన్నారు.

15న బండలాగుడు పోటీలు

శనివారం ఉదయం రాష్ట్రస్థాయి సీనియర్ విభాగం ఒంగోలు జాతి వృషభరాజములచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మొదటి బహుమతి రూ.లక్ష, రెండవ రూ.80 వేలు, మూడవ రూ.60వేలు, నాల్గవ రూ.50వేలు, 5వ రూ.40వేలు, 6వ రూ.30వేలు, 7వ రూ.20వేలు, 8వ రూ.10వేల నగదు బహుమతులు ఉంటాయన్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి వృషభరాజములకు రూ.5వేల కన్సలేషన్ బహుమతి ఉంటుందన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సబ్యం, మాగురు, అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కోరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట,ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు అందిస్తారన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రాని వారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ వెంకటరమణయ్య

ఎర్రగుంట్ల : మండలంలోని చిన్నదండ్లూరులో అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఎంపీడీఓ వెంకటరమణయ్య అకస్మీకంగా తనిఖీ చేసి పిల్లలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కేంద్రం చుట్టు దిబ్బలు, చెత్త చదారం లేకండా చూసుకోవాలని టీచర్లకు సూచించారు. అనంతరం గ్రామంలోని సచివాలయంను తనిఖీ చేశారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన



ప్రకృతి వ్యవసాయ కూరగాయలను పరిశీలిస్తున్న డాక్టర్ శేఖర్

వేంపల్లె : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అమ్మకపు ప్రదర్శన ప్రారంభించినట్టు జిల్లా మార్కెటింగ్ ఎస్‌ఎఫ్‌ఏ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సూచనలు మేరకు స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఎంటీ ప్రతాప్ సహకారంతో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చుట్టూ పరిసరాల ప్రాంతాల్లో పండించిన ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథిగా హాజరైన కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్ శేఖర్ మాట్లాడుతూ ప్రతిరోజు హాస్పిటల్‌కు వచ్చే రోగులు ఆరోగ్యం గురించి, తినే ఫుడ్ గురించి వచ్చిన గర్భిణీలు బాధితుల అనారోగ్యానికి కారణం మీరు తిన్న కల్తీ ఆహారమే కారణమన్నారు. ప్రతి వారంలో ఒకరోజు అమ్మకపు ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ, ఎంటీలు, రైతులు పాల్గొన్నారు,

ఐకమత్యంతోనే యూనియన్ సమస్యల పరిష్కారం



జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో యూనియన్ నాయకులు

పులివెందుల రూరల్ : ఐకమత్యంతోనే యూనియన్ సమస్యలు పరిష్కారమవుతాయని రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్‌బాబు తెలిపారు. బుధవారం ఏపీఈఈయూ 1104 యూనియన్ 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక విద్యుత్‌శాఖ డివిజన్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 1104 యూనియన్ నాయకుల తమ సమస్యలను రీజినల్ దృష్టి తీసుకెళితే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ సలీం, డివిజన్ సెక్రెటరీ సుదర్శన్, అడిషనల్ సెక్రటరీ వేణుగోపాల్, డివిజనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ హేమచంద్ర, ట్రెజరర్ వెంకటరత్నం, లైన్‌మెన్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మాఘ పౌర్ణమి వేడుకలు

వీరపునాయునిపల్లె : మండలంలోని సంగాలపల్లె శ్రీ శివకృష్ణ గోశాలలో బుధవారం మాఘ పౌర్ణమి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గోశాలలోని గోమాతలకు ప్రత్యేక పూజలు చేపట్టడంతో పాటు కృష్ణాలయంలో భగవద్గీత పారాయణం, బాగవత పఠనం నిర్వహించారు. అనంతరం పాయసంపల్లె, కీర్తిపల్లె గ్రామస్తులు తాళాల భజన కార్యక్రమం చేపట్టారు. పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న ప్రొద్దుటూరు పట్టనానికి చెందిన రామసుబ్బారెడ్డి గోశాల నిర్వాహణకు రూ.5వేల ఆర్థిక సహకారం అందజేశారు. ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులకు గోశాల నిర్వాహకుడు కల్లూరు రాజశేఖర్‌రెడ్డి అన్నాదానం ఏర్పాటు చేశారు.

వాటర్ గ్రిడ్ పనులకు ఇబ్బందులు పెట్టవద్దు



వెలిదండ్ల బస్టాండు సమీపంలో ప్రజలతో మాట్లాడుతున్న ఆర్డీఓ చిన్నయ్య

లింగాల : పులివెందుల నియోజకవర్గ ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు వాటర్ గ్రిడ్ ద్వారా సుమారు రూ.480 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న భారీ పైపులైన్ నిర్మాణ పనులకు ప్రజలు ఇబ్బంది పెట్టవద్దు అని ఆర్డీఓ చిన్నయ్య ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని పార్నపల్లె, వెలిదండ్ల, కర్ణపాపాయపల్లె గ్రామాల్లో ఆయన పర్యటించి ప్రజలతో మాట్లాడారు. పార్నపల్లె చిత్రావతి నది నుంచి రోడ్డు మార్గంలో వస్తున్న పైపులైన్ ఆయా గ్రామాల ఇళ్ల వద్ద నుంచి వెళుతోందని వాటిని ఎవరూ ఆటంకపరచొద్దని సూచించారు. అదేవిధంగా పార్నపల్లె గ్రామానికి చెందిన మల్లికార్జున అనే రైతు పొలంలో పైపులైన్ వెళుతోందని, పొలం కోతకు గురి కాకుండా రక్షణ గోడను నిర్మిస్తామని ఆయన రైతుకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ విజయ్‌భాస్కర్, తహసీల్దార్ ఈశ్వరయ్య, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కల్తీ ఆహార విక్రయాలు చేస్తే చర్యలు తప్పవు



కూల్ డ్రింక్స్ షాపును తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ హరిత

వేంపల్లె : ప్రజలకు కల్తీ ఆహారాన్ని విక్రయాలు చేస్తే అలాంటి దుకాణాదారులపై కఠిన చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ అధికారి హరిత హెచ్చరించారు. బుధవారం వేంపల్లెలో కూల్‌డ్రింక్ షాపులు, జ్యూస్ షాపులు, హోటళ్లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. వేసవి కాలంలో జ్యూస్ దుకాణాదారులు కల్తీ లేకుండా విక్రయాలు చేపట్టాలని, ఆహార భద్రత చట్టం 2005 నిబంధనలను లోబడి వ్యాపారం చేయాలన్నారు. ప్రజలకు నిబంధనలకు విరుద్ధంగా కల్తీ ఆహారం కానీ, కల్తీ జ్యూస్‌లు కానీ విక్రయాలు చేయరాదని, కల్తీ ఆహారం, జ్యూస్‌లు విక్రయాలు చేస్తే అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి హోటళయాజమానులు, జ్యూస్ దుకాణాదారులు లైసెన్సులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు కానిస్టేబుల్ నజీర్, ఫుడ్ సేఫ్టీ సిబ్బంది పాల్గొన్నారు.

దళితులకు నాయ్యం చేయండి

పెండ్లిమర్రి : పొలతల మల్లేశ్వరస్వామి దేవస్థానంలో షాపులు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్న దళితులను ఆలయ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దళితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అందెల బాలఓబయ్య కోరారు. బుధవారం పొలతల క్షేత్రంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. గంగనపల్లె గ్రామానికి చెందిన హరికృష్ణ, మరి కొందరు దళితులు గత 30 సంవత్సరాల నుంచి పొలతల క్షేత్రంలో చిన్న, చిన్న షాపులు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం ఉన్న దేవదాయశాఖ అధికారులు రాజకీయ కక్ష్యతో అక్కడ షాపు పెట్టవద్దని వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి దేవదాయశాఖ అధికారులపై చర్యలు తీసుసుకుని దళితులకు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు విజయరాణి, జిల్లా అధ్యక్షులు ప్రేమ్ కుమార్, అంజనమ్మ పాల్గొన్నారు.

కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకుని వాహనాలు నడపాలి



డ్రైవర్లకు సూచనలు అందిస్తున్న ఆర్టీవో

జమ్మలమడుగు రూరల్ : డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు తమ కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని వాహనాలను నడపాలని రవాణాశాఖ ఆర్టీవో మురళీధర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ప్రాంగణంలో 36వ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలను డిపో మేనేజర్ ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో మాట్లాడుతూ డ్రైవర్లు వాహనాలు డ్రైవింగ్ చేస్తున్న సమయంలో ట్రాఫిక్ నియమాలు పాటించి తమ వాహనాలను ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలన్నారు. పరిమితికి మించి వేగంగా వాహనాలను నడపరాదన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రవీంద్ర నాయక్, హేమ కుమార్, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ పెద్దిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం చెన్నకేశవస్వామి కల్యాణం



స్వామి కల్యాణ క్రతువులో తాళిని చూపుతున్న వేద పండితులు

వల్లూరు : మండలంలోని పైడికాలువలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవ, కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వాముల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై శ్రీదేవి, భూదేవి, శ్రీ చెన్నకేశవ స్వాములను కొలువుదీర్చారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామి హరినారాయణ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముత్యాల తలంబ్రాల కార్యక్రమాన్ని చూసిన భక్తులు తరించిపోయారు. కోలాట ప్రదర్శనలు అందరినీ అలరించింది. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఉదయం వివిధ హోమాలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భూమి ఉన్న ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య

లింగాల : మండలంలోని భూమి ఉన్న ప్రతి రైతుకు ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. బుధవారం మండలంలోని ఇప్పట్ల, అక్కులగారిపల్లె గ్రామాల్లో జరుగుతున్న రైతు గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు.రైతు గుర్తింపు సంఖ్య అనేది రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసిన తర్వాత భూమి గల ప్రతి రైతుకు కేటాయించబడే ప్రత్యేక గుర్తింపు సంఖ్య ద్వారా ప్రభుత్వ పతకాలు, సబ్సిడీలు, రాయితీలు అందిస్తారన్నారు.